అవధాని మరణం

రాణీ శివశంకరశర్మ

''బ్రహ్మగాడికి యీ రోజుల్లో దిక్కు లేదు'' అవధాని గొంతు పాతాళంలోంచి. ''ఈ రిజర్వేషన్లొకటి. ప్రతిభని పట్టించుకొనే వాడెవడు?'' వంత పాడాడు అవధాని పెద్ద కొడుకు శాస్త్రి.

''ఉద్యోగం వచ్చేస్తే వాడికే వో మంచి పిల్లను చూసి కట్టెయ్యచ్చు. కాని బ్రాహ్మడికి వుద్యోగం యిచ్చేవాడెవడు? లక్ష్మిలాంటి పిల్ల యింట్లో అడుగుపెడ్తే అదే వుద్యోగం వస్తుందంటే వింటాడూ? పుష్యమాసానికి ఏల్నాటి శని ముగుస్తుంది వాడికి. దాంతో వాడి జాతకమే మలుపు తిరిగిపోతుంది'' అన్నాడు అవధాని, వీపుని గోడకేసి రాస్తూ.

* * *

''నాన్నా కొంప మునిగింది''

''ఏమైందిరా''

''మీ ముద్దుల చిన్నాడు వ్యభిచార గృహంలో పోలీసులకి పట్టుబడిపోయాడు''

షాక్ తిన్న అవధాని ఆందోళనగా ''నువ్వు చెప్పేది నిజమేనా?''

''ఇంకా అనుమానమేమిటి? యీ వెధవ చివరికి లంజల కొంపలో దొరికిపోయాడు. ఇదీ వీడుపట్నంలో వెలగబెట్టే నిర్వాకం''

ఒక్కసారి కుప్పకూలిపోయాడు అవధాని. అతని మొహం మీద నీళ్ళు చల్లారు. కాస్తంత స్పృహ రాగానే అవధాని అడిగిన మొదటి ప్రశ్న ''యీ సంగతి అందరికీ తెలిసిపోయిందా?''

''చెడెంత కాలం దాగుతుంది నాన్నా'' అవధాని మూల్గాడు నీరసంగా ''ఐపోయింది అంతా ఐపోయింది''

భూమినుంచి మొత్తంగా తుడిచిపెట్టుకుపోతున్న వొక పురాతన క్షుద్ర జీవజాతి అతిమ అవశేషం అవధాని. అవధాని పుట్టినప్పటినుంచి దేశంలో ఎన్నో చెప్పుకోదగ్గ మార్పులు వచ్చాయి. కాలం తీవ్ర సంక్షోభంలో పొంగి పొర్లిన సందర్భాలూ వున్నాయి. స్వాతంత్ర్య పోరాటం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కాలంలో అవధాని యువకుడు. అతడొక చెరువుగట్టుమీద సంధ్య వారుస్తూ వుండగానే స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ''అలాగా? ఐతే?'' అదే అవధాని ప్రతిస్పందన. ఊర్లోకి కరెంటు వచ్చింది. బస్సులొచ్చాయి. ప్రసార సాధనాలొచ్చాయి. ఇలా ఎన్నో యెన్నెన్నో జరిగాయి. యింటా బయటా. 70 యేళ్ల

జీవితం గడిచిపోయింది కానీ అవధాని అవధానే. భగవద్గీతలో చెప్పినట్లు అతడు తాబేలులా యింద్రియాల్నీ అన్నిటినీ ముడుచుకొని జీవించాడు. కాలం తెచ్చే మార్పు ఆ పై డిప్పని కూడా తాకలేకపోయింది. అసలు అవధానికి ప్రతి చిన్న మార్పూ మహాపాపమే. కాలం పరిణామ శీలమన్న వాస్తవం అవాస్తవమైంది. అవధాని కాలం అతడు పుట్టిన చోటనే నిలిచిపోయింది.

ఇప్పుడు అవధాని భయంకరమైన కల్లోలానికి గురయ్యాడు. దానినుంచి ఏ దేవతలూ కర్మ సిద్ధాంతమూ అతనిని రక్షించలేకపోయాయి. ''రామా కృష్ణా అనుకొంటూ కాటికి పోవలసిన వయసులో యీ కర్మేమిటో'' జ్వరగ్రస్త కంఠంతో మూల్గాడు అవధాని. ''వాడికి ఎవర్తైనా తొందర్లో కట్టేద్దామంటే నువ్వు వొప్పుకోలేదు. ఇప్పుడా లంజ పక్కలో పడుకొని మన పరువూ ప్రతిష్ఠా మంట కలిపితే నీ కడుపు నిండిందా?'' ఏం చెయ్యాలో తెలియక పెద్దకొడుకు శాస్త్రిమీద మండిపడ్డాడు అవధాని. ''నీ మాటెపుడూ కాదనివ పాపానికి నామీద మండిపడ్తున్నావ్. పర్మినెంటు వుద్యోగం లేకపోతే యెలా పోషిస్తాడని వద్దన్నాను. అసలు వాడికే పెళ్లి చేసుకోవడం యిష్టం లేదని తేసి చెప్పలేదూ?''

''ఏమిటా వెధవ యిష్టం? నువ్వు నేను చెప్పినట్లు చేసుకొని తగలడలేదూ? మెళ్లు వంచి చేయాల్సింది. ఆ గుల కాస్తా తీరేది. ఇంతకి తెగించినవాడు రేపు యే కులం తక్కువదాన్నో తెచ్చి నీ కోడలనడని నమ్మకమేమిటి?''

ఒకరోజు గుళ్లోకెళ్లి తిరిగి వస్తూ శాస్త్రితో అవధాని ''ఆ పూజారి నన్నలా యెందుకన్నాడు''

''ఏమన్నాడు''

''నెత్తిమీద శఠగోపం పెడ్తూ ముందుకు వంగి మీ కొడుకు దొమ్మరి గుడిసెలో పట్టుబడిపోయాట్ట కదా అని అడగలేదూ?''

''లేదు అలా అడగలేదు. మీ చిన్నాడికి పెళ్లెప్పుడు చేస్తారని అడిగాడంతే మీరు భ్రమ పడ్తున్నారు'' దాంతో అవధాని మానసిక స్థితిని గురించి అతనికి భయం పట్టుకుంది.

చీకటి సందులోంచి వస్తున్నారు అవధాని ''ఎంతటి వాళ్లకైనా తలరాత తప్పదండీ. ఆ అవధాని నీళ్లనీ వాళ్లనీ దుమ్మెత్తి పోసేవాడు కాదూ? యిప్పుడాయన కేగతి పట్టింది! చయన్లు కొడుకు కిరస్తానీదాన్ని పెళ్లాడలేదు? అవధాన్లు కొడుకు కిరస్తానీ కొంపలో పట్టుబడిపోయాడు''

''అసలు మన్లో మాట ఎందరు పెద్దమనుషులు ఆ గుడిసెల్లో దూరలేదూ? ఎవరూ వెళ్లకుండానే ఆ వ్యాపారం నడుస్తోందంటావా?''

''సర్లేవోయ్. వాళ్లందర్నీ ఎవరు చూడొచ్చారు? దేనికైనా చాటుండద్దూ? అవధాని కొడుకుని సంకెళ్లు వేసి తీసుకెళ్లారట కదూ?'' అవధాని పరుగు పరుగున వచ్చి మంచంమీద కుప్పకూలిపోయాడు. భోరున యేడవటం మొదలుపెట్టాడు. ''ఐపోయింది అంతా ఐపోయింది. గౌరవం మంట కలిసిపోయింది. అందరికీ తెలిసిపోయింది'' అవధాని మంచం పట్టాడు.

అవధాని గది కిటికీ తలుపులన్నీ మూసేశాడు. వెల్తురికి కళ్లు పోట్లు పెడ్తున్నాయి.

మనుష్యుల మొహాల్ని చూస్తుంటే అవధానికి వాంతి వస్తోంది. కటిక చీకట్లో పడుంటున్నాడు స్తబ్దంగా, వొంటిమీద పాకే బొద్దింకల్ని కూడా అదిలించకుండా. కాని తిండి మాత్రం తగ్గకపోడమే కాదు రెట్టింపైంది. ఇప్పుడు అతని భారీకాయం మీద తలకాయ మాత్రం నిమ్మకాయలా వుంది. మంచం దిగడం మానేశాడు. కాలకృత్యాలన్నీ మంచంమీదే. అవధాని ఆవేశంతో ''వెధవ ప్రపంచం దీన్ని తగలెయ్య అంతా పోయింది. గౌరవం మర్యాదా, చంపెయ్యండి వాళ్లే చంపెయ్యండి'' అంటూ పిచ్చిగా అరిచేవాడు. ''సన్యాసం పుచ్చుకుంటా. అహం బ్రహ్మాస్మి'' అంటూ బట్టలు విప్పేసి గంతేవాడు. ''ఈ వెధవ పల్లెటూరులో నేనుండలేను. పైగా యీ ముసలాడి పిచ్చొకటి తల పగిలిపోతోంది'' అంటూ విసుక్కొనేది శాస్త్రి భార్య. ''ఏం చేస్తాం చెప్పు పరిస్థితి అలాంటిది. మనం యీ పరిస్థితుల్లో విడిచిపెట్టి పోతే లోకం ఏమనుకుంటుంది? తొందర్లోనే అంతా కుదుటపడ్తుంది'' ఓదార్చాడు శాస్త్రి. కాని వారం రోజులైనా అవధాని అలానే వున్నాడు. అర్ధరాత్రి హఠాత్తుగా లేచి ''సన్యాసం పుచ్చుకుంటా'' అని పరిగెడ్తుంటే గదిలోకి నెట్టి తాళం వెయ్యడం మహాకష్టమయ్యేది. ''అవధానిగారికి ఆత్మానుభూతి కలిగిందేమో. అలాంటివాళ్లు అలాగే ప్రవర్తిస్తారు'' అన్నాడు అవధాని ఆధ్యాత్మిక వారసుడొకడు. మరొకడా మాట కొట్టేస్తూ ''బహుశా అది ఢాకినీ పిశాచం హనుమద్భక్తులైన భూతవైద్యులే దాన్ని తరిమేయగలరు. నా మిత్రుడొకడున్నాడు తీసుకొస్తాను'' అన్నాడు.

మర్నాడు ఖరీదైన ఆధునిక దుస్తులలో మెరిసిపోతూ, బూట్లు టకటక లాడిస్తూ వొకడొచ్చి తనని భూతవైద్యుడిగా పరిచయం చేసుకొన్నాడు, యింగ్లీషులో. ''వీడు భూతవైద్యుడేమిటి?'' ఆశ్చర్యపోయాడు శాస్త్రి. విభూతి, పెద్ద కుంకుమబొట్లు, చేతిలో వేపకర్రతో చూస్తేనే భూతం దిగేలాగుండాలి కదా? భర్తనే యిష్టం వచ్చినట్లు తిడ్తున్న తన తల్లికి వొక భూతవైద్యుడు కొరడాతో భూతాన్ని వదిలించిన సంఘటన గుర్తుకొచ్చింది. కాని ఈ భూతవైద్యుడింత నాజూకుగా వున్నాడేమిటి? పిల్లలు కూడా భయపడరు వీణ్ణి చూసి, భూతాల సంగతి తర్వాత. ఆ భూతవైద్యుడు టీ తాగుతూ స్పీచ్ యిచ్చాడు యింగ్లీషులో. ''భూతవైద్యం కూడా వైద్యమే. దీన్ని కూడా శాస్త్రీయంగా నిరూపించవచ్చు. జార్జి భూన్‌స్టన్, జార్సన్ భూతవైద్యం గురించి శాస్త్రీయంగా అద్భుతమైన పుస్తకాలు రాశారు. సంస్కృతంలో భేతాళ శర్మ భూపాలశాస్త్రి రాసిన గ్రంథాలెలాగూ వున్నాయి. అసలు ఘోస్ట్ మెడిసన్ (భూతవైద్యం)కి కూడా ఎం.బి.బి.ఎస్ కోర్సు ఎందుకు పెట్టకూడదు? యిండియన్ కల్చరంటే నిర్లక్ష్యం. యిది మాత్రం వృత్తివిద్య కాదా? యింతకాలానికి జ్యోతిషం కోర్సు యూనివర్శిటీలో పెడ్తున్నారట శుభం. మరి భూతవైద్యం? దాన్ని కూడా ప్రవేశపెట్టి నాలాంటి స్కాలర్ని ప్రొఫెసర్ చేస్తే...'' భూతవైద్యం విశిష్టతని గురించి అనర్గళంగా మాట్లాడూ, సంస్కృత శ్లోకాలు కూడా వల్లించడం మొదలుపెట్టాడు. ''భూతానా మస్మి చేతనా భూతాలకి చైతన్యం నేనే అని శ్రీకృష్ణుడనలేదూ అంటూ భూతాల వునికి గురించి భగవద్గీత ప్రమాణం చూపించాడు. దాంతో శాస్త్రి ముగ్ధుడైపోయాడు. అర్థంతో పనిలేదు. సంస్కృత శ్లోకాలు వినిపిస్తే చాలు మూర్ఛపోతాడు శాస్త్రి. అప్పుడు శాస్త్రి ''భూతవైద్యం కూడా హిందూ సంస్కృతికి అలంకారమే'' అనుకున్నాడు.

చల్లని గాలి తెర కిటికీలోంచి చెంపల్ని తాకింది. భూతవైద్యుడు యేదో వింటున్నట్లు చెవిని కిటికీ దగ్గర పెట్టి ''హనుమంతుని సందేశం గాల్లో తేలొస్తోంది హ్రాం హ్రూం హ్రీం ఢాకినీ పిశాచం''

స్నానించి వచ్చి భూతాల డాక్టర్ మొహానికి దట్టంగా విభూతి పులుముకున్నాడు. పెద్ద కుంకంబొట్టు పెట్టాడు. రంగురంగుల ముగ్గులేశాడు. చీకటి గదినుంచి అవధానిని ముగ్గుల మధ్యకు లాక్కొచ్చారు. అర్థం లేకుండా వాగుతున్నాడు అవధాని. ''హనుమాన్ యీ భూతం పేరేమిటి?'' అరిచాడు యింటికప్పు వైపు చూస్తూ భూతవైద్యుడు. ''ఆ లంజే భూతం మా కొంప ముంచింది'' అవధాని నుంచి తక్కున సమాధానం. నాజూకు భూతవైద్యుడు తన అసలు రూపం బయటపెట్టాడు కొరడా ఛళ్ ఛళ్ మంది. ''ఢాకినీ శాకినీ హ్రాం హ్రీం హ్రూం పవనకుమార'' కొరడా దెబ్బలకు నాట్యం చేశాడు అవధాని. ''చంపెయ్ నన్ను చంపెయ్ లంజకొడకా. కొరడాకి సుఖరోగం, మా వంశానికే నీయమ్మ...''

''యిది శూద్రభూతం బూతులు కూడా మాట్లాడ్తోంది'' అన్నాడు భూతవైద్యుడు.

* * *

తలుపు తెరుస్తుండగా పొరపాటున లోపలికి చొరబడిన వెల్తుర్లో చింపిరిజుట్టు పిల్ల ఎవర్నువ్వు'' అవధాని అరుపుకి వులిక్కిపడి ఆ అమ్మాయి ''ఎంకడి కూతుర్ని''

''లంజా నీ చేత చేయిస్తున్నారటే, నన్ను పిచ్చివాణ్ణి చేసి, పిలు వాణ్ణి''

''నువ్వు కూడా నా సర్వనాశనాన్నే కోరుకుంటున్నావట్రా, మాలదాన్ని యింట్లోకి తీసుకొస్తావా? యీ యింటిని తగలెట్టినా మైల వదుల్తుందా? యింతకీ ఆ లంజేమైంది?''

''అమ్మకి కూడా వొంట్లో బాగాలేదు''

''నీ పెళ్లామేం చేస్తోందిరా''

''యీ చాకిరీ చేయునంటోంది''

''అనకేం చేస్తుంది నువ్వు చవటవైతే? నేనూ సంసారం చేశారా. యిలాగా? ఆడదానికి కాస్తంత భయం కూడా వుండాల్రా''

''నీమీదామెకు యేమాత్రం అభిమానం లేదు. ఆమె తండ్రి నెపుడూ తిడ్తూ వచ్చావ్. యిప్పుడు మీ చిన్నకొడుకు మాత్రం యేం చేశాడని అడుగుతోంది''

''అడక్కేం చేస్తుంది అలుసిస్తే. యిప్పుడూ తిడ్తాను దాని తండ్రిని. తాగుబోతు వెధవ, ముండల ముఠాకోరు. డబ్బు తప్ప గౌరవమూ మర్యాద యేమీ తెలియని వెధవ''

''అంత ధర్మం తెలియనివాడి కూతుర్ని యెందుకు చేసుకోమని పట్టుబట్టావ్? తాగి రోడ్డుమీద పడిపోతుంటాడని తెలియందా? ఆమె నక్షత్రం మంచిది కాదంటే శాంతులున్నాయన్నావ్. అంతక్రితం అదే నక్షత్రం కల వేదపండితుడి కూతుర్ని కాదన్నదీ నువ్వే. అసలు సంగతి డబ్బు. చివరి వరకు నన్ను వాళ్లు భుజాలమీద మోస్తారనుకొన్నావ్. కొంచెం నిర్లక్ష్యం చేయగానే పాపాత్ములైపోయారు''

''ఔన్రా. నీ సుఖం కోసమే కలవారి అమ్మాయిని చేసి చూశాను. నీ అచ్చట ముచ్చట

తీరుస్తారని. దరిద్రులకి ధర్మం సంస్కారం వుంటాయని నమ్మకమేమిటి? పొట్టకూటి కోసం నానా గడ్డీ తింటారు. పూర్వజన్మ సుకృతం వల్ల నీ మామకి లక్షలాది ఆస్తి వారసత్వంగా వచ్చింది. ధర్మంగా వుంటారనుకున్నాను. కానీ ఆ వెధవ ఆ లంజలకి వియ్యంకుళ్లలా గౌరవించాలో కొంచెం కూడా తెలీదు. అందులోనూ నాలాంటి పండితుణ్ణి, ధర్మాత్ముణ్ణి. ఎంతోమంది ఐశ్వర్యవంతులు నా పాదాలు కడిగి నెత్తిమీద జల్లుకుంటార్రా. మీకేం తెలుసురా నా విలువ. నువ్వు కూడా నన్ను వెర్రి వెధవని చేసి మాలదాన్ని యింట్లోకి లాక్కొచ్చి అన్ని పన్నూ చేయించావ్. నా పరువేమౌతుందిరా. వాడు లంజల కొంపలో పట్టుబడిపోయి పరువు తీశాడు నువ్విలా...''

''ఆ పిల్ల మాత్రం మనిషి కాదా? బ్రాహ్మణుడిని కుక్కని అధమ జాతివాణ్ణి అందర్నీ పండితులు సమానంగా చూస్తారని గీతలో లేదా?''

''ఆత్మంతా వొకటేనని కుక్కకి వంటింట్లో పీటేస్తావ్రా. నేను చెప్పిన భాష్యాల్ని నాకే యిలా అప్పజెపుతున్నావా?''

''కాలంతోపాటు కొంతైనా మారాలి నాన్నా బ్రాహ్మలు వేరే కులాలవాళ్లని పురుగులా చూస్తారని గ్రంథాల్లో కూడా అలాగే రాశారని విమర్శిస్తున్నారు. వేరే అగ్ర కులాల వాళ్లకి కూడా మనమంటే వొళ్లుమంటే''

''శూద్రులు వేదం వింటే చెవిలో సీసం పొయ్యాలని, వాళ్లు శ్మశానం వంటివారని ధర్మశాస్త్రాలు ఘోషిస్తున్నాయి. యీ కలికాలం వెధవలకేం తెలుసు?''

''కాలానికి అనుగుణంగా కొంచెం ధర్మాల్ని మారిస్తే యేమవౌతుంది? అందరు హిందువులూ సమానమందాం. అప్పుడు వేరే మతాలవాళ్లని తరిమేయవచ్చు. చివరికంతా మనమే ముందుండి నడిపించవచ్చు''

''బ్రహ్మిగాడు గడ్డి తినాలంటావ్. వాడూ ఈ అలగాజనంలో కలిసిపోవాలంటావ్''

''అసలు ఆధ్యాత్మికతకి వారసులు బ్రాహ్మణులేనని నాకు తెలుసు నాన్నా. అతనికి భగవంతుడిచ్చిన ప్రతిభ వుంది. అది వేరే కులంవారి కెవరికీ రాదు, ఎన్ని రిజర్వేషన్లిచ్చినా''. 'అది సరే అందరూ సమానమంటూ యివాళ మాలదాన్ని యింట్లోకి తెచ్చావ్. రేపు నీ కొడుకు పెళ్లే చేసుకొంటాడు. అసలే బ్రాహ్మడు అన్ని విధాల అధోగతికి పోతున్నాడు. ఎంతోమంది బ్రాహ్మలు ఆస్తులు అమ్మేస్తే, వేరే కులాలవాళ్లు కొనేశారు. మన పూర్వీకులు చేసిన తపస్సు వల్ల నీ మామగారిలాంటి కొందరదృష్టవంతులకి ఆస్తులు మిగిలాయనుకో. అప్పటికీ భూసంస్కరణలని గవర్నమెంటు మనవాళ్లమీద పడలేదూ? భగవంతుడి దయవల్ల, ప్రభుత్వంలోనూ ధర్మాత్ములుండటం వల్ల మనవాళ్లు జాగ్రత్త పడ్డారనుకో. యిప్పటికీ దున్నేవాడికే భూమి అని అరుస్తూనే వుంటారు వెధవలు. ఎవడబ్బ సొమ్మనుకొన్నారో, వాళ్లని నెత్తికెక్కించుకొంటే ఆస్తులకే ఎసరు పెడతారు. మేస్త్రీదే యిల్లంటారు. గుళ్లల్లో మేమే పూజలు చేస్తామంటారు. అప్పుడు బ్రాహ్మడు రిక్షా తొక్కుకోవాలి. చెప్పులు కుట్టుకోవాలి''

''చెమటోడ్చి సంపాదించిన ఆస్తులమీదికొస్తే ఎవరూరుకుంటారు? అవన్నీ కమ్యూనిస్టుల నినాదాలు నాన్నా. మనం వూరికే వుపన్యాసంలో హిందువులందరూ వొకటే

అని అరిస్తే ఏం పోతుంది! ప్రయాణాల్లోనూ బజార్లలోనూ ఎలాగూ తాకుతుంటాం కదా? అస్పృశ్యత మహాపాపం అంటే ఏం పోతుంది? వాళ్ళూ సంతోషిస్తారు. అలాగే వాళ్లచేత యింటి చాకిరీ చేయించుకొన్నంత మాత్రాన కొంప మునిగేదేముంది? ప్రపంచంలోకెల్లా హిందువులు గొప్పవాళ్ళు, వాళ్లలో బ్రాహ్మలు గొప్పవాళ్లని నేనూ వొప్పుకుంటాను. నేను నా కొడుక్కి బ్రాహ్మల అమ్మాయితోనే శాస్త్రోక్తంగా పెళ్లి జరిపిస్తాను. సంస్కృతం కూడా నేర్పుతాను సెలవుల్లో. బ్రాహ్మణ జాతి గొప్పతనాన్ని సైన్సు ప్రమాణాలతో బలపరుస్తూ యింగ్లీషులో వ్యాసం రాశాను కూడా''

''సైన్సూ, తర్కమూ, ఆలోచనా యివన్నీ యెంతరా. శంకరాచార్యుల వారి పాదధూళి విలువ చేయవు. క్షుద్ర క్రిమిలాంటి మనిషెంత. వాడి బుర్రెంత? విద్యార్థులు అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేశార్ట. వాళ్లని చూసి బుద్ధి తెచ్చుకోరా. ఆ మాలదాన్ని బైటికి తన్ను. నీ భార్యని చాకిరీ చేయమను. రామాయణం చదివావెందుకురా, అగ్నిలో దూకమంటే సీత దూకింది. నీ పెళ్లాన్ని నాలుగు తన్ను. దార్లోకొస్తుంది''

''అది నా వల్ల కాదు. అది డబ్బున్న వాళ్లమ్మాయి. నా మాట వినదు''

''పోరా వెధవ ఫో. నాకెవరితో సంబంధం లేదు. అంతా మిథ్య, రజ్జు సర్పభ్రాంతి. నన్ను దేశంలోని ఆచార్యులందరూ నెత్తికెక్కించుకున్నారు. మీరెంతరా పురుగులు, చీమలు పొండి, నాశనమైపొండి''. పిచ్చిబలంతో శాస్త్రిని నెట్టి గడియవేసేశాడు అవధాని. బోర్లాపడుకుని ఏడవాలనుకొన్నాడు. వొక కన్నీటి చుక్క కూడా రాలేదు. ''అందరూ వెధవలే. కొడుకులు, కోడలు, కూతుళ్ళు. వెధవ ప్రపంచం పూర్వం ఎలా వుండేవారు? ఋషుల్లా బతికారు గౌరవంగా. తను మాత్రం తండ్రి మాటని వేదంలా భావించి అనుసరించేవాడు కాదా? కాని ఆస్తి కోసం గోడకి తలకాయని... అదంతా యిప్పుడెందుకు? అలా తండ్రి నెదిరించి యీ ఆస్తిని నిలిపింది ఈ వెధవల కోసమే కదా? తన చెల్లెలు మాత్రం పెళ్లైన రెండు నెలలకే మొగుడు చస్తే, గుండు గొరిగించుకుని మూల కూర్చుంది. కాని ఈ కాలపు లంజల్లా... పెంటకుప్పమీద శిశువు శవం. దాంతో తన కుటుంబానికే సంబంధం లేదు. ఏమీ లేదు. అంతా భ్రాంతి. తన తండ్రి వేదం చదువుతుంటే దేవతలు దిగొచ్చేవారు. తన పెళ్లాం చెయ్యి పట్టుకుని... ఛీఛీ... అంతా కల. తన కూతురికి చిన్నతనంలోనే శాస్త్రోక్తంగా పెళ్లి, 13 ఏళ్లకే కడుపు, పిచ్చి. అంతా కర్మ, భగవల్లీల. ఎంత వెనక్కి వెళ్లగలిగితే అంత వెనక్కి అన్నీ అపశ్రుతులే. వేసిన ప్రతి అడుగూ తప్పటడుగే. సమాజంలో అందరికీ వున్నబొక్కలే తనకీ తన వంశానికీ. కాని తన వంశంలో అందరూ గుట్టుగా గౌరవంగా మర్యాదగా బతికారు. ఈ వెధవల్లా మెళ్లో ఎముక లేసుకుని తిరగలేదు. గౌరవంగా, గుట్టుగా, మర్యాదగా... అనే అలవాటుపడ్డ పదాలు మళ్లీ మళ్లీ వుచ్చరించాడు. ఆత్మరతిలోని ఆనందం కలిగింది. కాని ఆ పవిత్ర పదాల మధ్య తన కొడుకు లంజతో పట్టుబడిపోయాడు. అబద్ధం, అబద్ధం, భ్రాంతి, మిథ్య అని అరిచాడు. ఎన్నిసార్లు అరిచినా ఆ నిజం అలాగే వుంది. ఈ పెద్దాడు మాత్రం ఏం మర్యాద నిలబెట్టాడు. అందరూ వెధవలే అందరూ లంజలే. అహం బ్రహ్మాస్మి. నిర్గుణం డుర్. నిరంజనం డుర్ డుర్... నిర్లిప్తం డుర్ డుర్ డుర్... గదంతా దుర్గంధం. ఔను ఆ కటిక చీకట్లో అంతా నిర్గుణమే. ఆ చీకటి అతనికి చాలా హాయినిచ్చింది. దేన్నీ

చూడనక్కరలేదు. ఎవరితోనూ మాట్లాడనక్కరలేదు. అహం బ్రహ్మాస్మి ఎవరెలా చచ్చినా నాకేం? ఎవరి కర్మకి వాళ్లు పోతారు. కాతే కాంతా కస్తే పుత్రః

* * *

భార్య కెవ్వుమని అరవడంతో పక్కకి దొర్లాడు శాస్త్రి. అప్పుడు చూశాడు దూలానికి వేళ్లాడ్తున్న గబ్బిలాల మూలని. వాటి నల్లని రెక్కల నీడలు అతని మొహంమీద ప్రసరించాయి. కొన్ని క్షణాలపాటు అతని బుర్ర స్తంభించిపోయింది. ''ఐపోయిందా అంతా ఐపోయిందా? ఈ యిల్లు శిథిలమై నేలమట్టమైపోతుందా? తరతరాల సంప్రదాయాలతో, పవిత్ర గ్రంథాలతో, పూర్వపు గౌరవ మర్యాదలతో సహా రేపటికేమీ మిగలదా? గబ్బిలాలు పరిహాసంగా రెక్కలాడిస్తున్నాయి. అతని ముఖంపై మృత్యుభయం తచ్చాడింది. అతని భయంనుంచి విముక్తి కోసం శ్లోకాలని మంత్రాలని గుర్తుకు తెచ్చుకొనేందుకు ప్రయత్నించాడు. కాని ఫలితం శూన్యం. మృత్యుభయంలో అన్నీ కొట్టుకుపోయాయి. దైవదత్తమైన అతని ప్రతిభ ఆ క్షణంలో పూర్తిగా పూడుకుపోయింది. మృత్యువు మరింత సన్నిహితౌతున్న ఆందోళన. అతడొక్కసారిగా మంచంమీంచి చావు ముదంటి ఆదిమోద్రేకంతో దూకి కర్రతో వాటిని తరమాలని ప్రయత్నించాడు. కాని అవి ఆ గదిలోనే చక్కర్లు కొట్టడం మొదలెట్టాయి. ఆ పవిత్ర గృహపు శైథిల్యాన్ని సూచిస్తూ. హఠాత్తుగా ఉలిక్కిపడి లేచాడు శాస్త్రి. ''ఇది కలా నిజమా?''

* * *

అవధాని తలుపులు మూసేసి వొక రోజైంది. ఎన్నిసార్లు పిలిచినా పలకలేదింత వరకూ. ''కడుపు కాలితే ఆయనే తెరుస్తారు'' అన్న అవధాని కోడలి మాట వమ్మైంది. శాస్త్రికి సందేహం పెరిగి తలుపులు మోదాడు. లోపలికి సమాధానం లేదు. చివరికి తలుపులు బద్దలు కొట్టాడు. ఆ చీకటి గది గందరగోళం పైన వెల్తురు ప్రసరించింది. ప్రాచీన గ్రంథాలన్నీ కాగితాలెగిరిపోతూ చెల్లాచెదురుగా, చెద తినేసిన తాళపత్ర గ్రంథాలు, పగిలిపోయిన పీఠాధిపతుల దేవతల పటాలు, సీసం పెంకులు, స్వైరవిహారం చేస్తున్న బొద్దింకలు. వొక శిథిల భాష్యం కింద బొద్దింక చచ్చిపడి వుంది. ఆ గదే మరణ వేదనతో గింజుకున్నట్లుంది. ఆ గందరగోళపు గది మధ్యలో వొక వికృత సరీసృప కళేబరం. వొక్కసారి అడుగు వెనక్కేసి కెవ్వున అరిచాడు. క్షణం తర్వాత తేరుకున్న శాస్త్రి విషాదంతో కుంగిన స్వరంతో వణాల్గాడు. ''భగవాన్! ఎంత వికృతమైన కళేబరం?'' తనకి కూడా ఆ మృత్యువు సంక్రమిస్తోందన్న భయంతో వణికిపోయాడు. ''వద్దు వద్దు'' అంటూ ఏడ్చాడు. తర్వాత జీవ శాస్త్రజ్ఞునిగా యీ పరిణామం అతనికి వుత్కంఠని కలిగించింది. ''జీవ పరిణామం అంత వెనక్కెలా తిరిగింది?'' కాని మరుక్షణం కుటుంబ గౌరవం, మర్యాద అతనిలోని శాస్త్రజ్ఞుని నోరు మూయించాయి. ఎవరైనా చూస్తే? రెండు పెద్ద పంచెలు ఆ కళేబరంనిండా కప్పేసి ''హమ్మయ్య'' అని నిట్టూర్చాడు.

''కర్మకాండ వైభవంగా జరిగింది. చాలామంది పెద్దమనుషులు వచ్చారు. డబ్బు కూడా యిచ్చారు. ఎంతైనా శాస్త్రికి 10వేల చేతి చమురు వదిలింది. అతని భార్య విసుక్కుంది

కూడా. అందరూ శాస్త్రిని మెచ్చుకున్నారు. పెద్ద సైంటిస్టై వుండి కూడా తండ్రి తద్దినం వైభవంగా జరిపాడని, మంచి దక్షిణ లిచ్చాడని.

అవధాని మరణం ముగిసి వారం రోజులైంది. అప్పుడు శాస్త్రికి వుత్తరం వచ్చింది తమ్ముడినుంచి.

''నాన్నగారి మరణం గురించి నాకు తెలియజేయడం మానేసి మీ పరువుని మర్యాదని నిలుపుకొన్నారు. ఆయన బతికున్నంత కాలం తనకి శాస్త్రోక్తంగా కర్మకాండ జరుగుతుందో లేదోనని బెంగపెట్టుకున్నాడు. ఆయనకి ఆత్మశాంతి కలిగించావు నువ్వు. నిజం చెప్పకపోవడమేం, ఆయన మరణాన్ని గురించి నేనేమీ విచారించడం లేదు. దొంగ మర్యాదలు పరువు ప్రతిష్ఠలూ పేకమేడల్లా కూలి ఆయన చచ్చిపోయాడు. ఆయన మరణం మరెలా వుంటుంది? అందులో నా ప్రమేయం యాదృచ్ఛికం. కాని అవధాని అంతిమ క్షణాల అంతరంగాన్ని రికార్డు చేసే పరికరం ఏదైనా వుంటే యెంత బాగుండును? అన్ని రకాల మార్పుని వ్యతిరేకించే పవిత్ర క్షుద్రజీవి అవసానం యెంత భయంకరమో, భవిష్యత్తరాల వారికి హెచ్చరికగా ఉండేది. పరిసరాలకే మాత్రం స్పందించని జీవిత పర్యవసానమది. మిగిలినవారి నుంచి మనని వేరు చేసుకొనేందుకు ఏర్పరచుకొన్న ప్రత్యేక పవిత్ర అవలక్షణాలు చావుకే రహదార్లు. డైనోసార్స్ లాంటి భారీకాయులు భూమినుంచి యెలా అంతరించాయో నీకు తెలుసు. మితిమీరిన ప్రత్యేకతల ఫలితం ప్రతిష్టంభన వినాశనాలే కదా?

సరే దహనం కూడా ఐపోయింది కదా? కాని అవధాని మరణం పునరావృతం కాకూడదు. మనం అవధానిని అతని వ్యర్థ వేదాంతాన్నీ యింగ్లీషులోకి తర్జుమా చేసుకొంటూ, కుళ్లు సంప్రదాయాలతో, తంతులతో, సాటి మనుషులపై ఏవగింపుతో, అహం బ్రహ్మాస్మి అహంకారంతో బతుకీడిస్తే మన చావు అంతకన్నా భయంకరంగా వుంటుంది. అవధాని బతుకుకి ప్రతిబింబమే అతని చావు కూడా, తరాల బాటు ఏ మార్పు లేకుండా ఎందుకిలా బతుకుతున్నాం, మనకంపే ఇంపనుకుంటూ, లోపల చూస్తే అంతా డొల్ల. ప్రేమ లేదు అవగాహన లేదు. ఒకరికీ మరొకరికీ వంతెనలు లేవు.

తంతులు, పెళ్లిళ్లు బారసాలలను మంత్రాలు, తంత్రాలు, చిరునవ్వులు పులుముకొన్న ముఖాలు, చచ్చునీతులు, అందమైన మాటలు, ఏం పిండుకొన్నాం తరతరాలుగా యీ వెధవ బతుకునుంచి, యీ సిఫిలిస్ వారసత్వంనుంచి. నాన్నగారు అమ్మకీ యిష్టాలుంటాయనే సంగతిని యెప్పుడైనా పట్టించుకొన్నారా? ఆమెను మనిషిగా ఏనాడైనా చూశారా? సారం పిండుకుని పిప్పి చేశారు. ఐనా వేదాంతాలూ సిద్ధాంతాలూ ఆయనని పశ్చాత్తాప భారం కింద నలిగి చావకుండా 70 ఏళ్లు వచ్చేవరకూ రక్షించాయి. నువ్వు నాన్నగారి కళ్లతోనే ఎన్నుకొన్నావ్ డబ్బుని కులాన్ని ఎగాదిగా చూసి. యిప్పుడేడుస్తావ్. డబ్బుతో ఆమె వెంట వచ్చిన అహంకారాన్ని మింగలేక కక్కలేక. డబ్బున్న అందగత్తెకు ఆదర్శ భర్తవైనందుకు మరోవైపు మురిసిపోతూనే వుంటావు. ఔను పైపైన మన జీవితాలు మిరిమిట్లు కొల్పుతూండవచ్చు. మనం మంచి వుద్యోగం వల్ల, ధన సంపాదన వల్ల, పాండిత్యం వల్ల అందరినీ అలరించవచ్చు. అట్టడుగున ఎలా వున్నాం? మనకి రాముడెందు కాదర్శమయ్యాడు? పెద్దమనుషుల మెప్పు దొంగ గౌరవాల కోసం పెళ్లాం సెక్స్ నీతిని

పరీక్ష పెట్టడానికి కూడా సిగ్గుండదు వాడికి. లోక మర్యాదల్ని ఏ అమాయక నిప్పు జాలివాడో కారడవుల్లో అతిక్రమించినా ఖూనీ చేస్తాడు. అలాగే మనం కూడా కుళ్లు పెద్దమనుషుల మెప్పు కోసం పనికిమాలిన లోక మర్యాదల కోసం అంతరంగాల్ని పూడ్చి పెట్టేసి బతుకుతున్నాం. ప్రతీ ప్రగతికరమైన అంశానికీ ఎద్దుల్లా అడ్డు పడ్తున్నాం. దాన్నే మనం సంస్కృతి అని ముద్దుగా పిలుస్తున్నాం.

ఈ సంస్కృతే నన్ను విసుగెత్తించింది. అక్కయ్యకి పిచ్చెక్కించింది. అత్తయ్య జీవితాన్ని నాశనం చేసింది. అమ్మని ఎద్దులా తయారుచేసింది. మనిషిమీద విశ్వాసాన్ని, సృజనాత్మకతని, వెల్తుర్ని, గాలిని దూరం చేసింది. ఆ శిథిల పవిత్ర గృహపు నీడ నా జీవితం పొడవునా పరచుకొని నిరాశని నింపేసింది. లక్ష్యం లేకుండా చేసింది. నేనీ నీడ నుంచి తప్పించుకోవడం కోసం లక్ష్య రహితమైన నా జీవితాన్ని యిష్టమొచ్చినట్లు పరిగెత్తించాను. వ్యర్థమైన పరుగు, మత్తుమందుల కలవాటుపడ్డాను. వేశ్యల పక్కల్లో నిద్రలేని రాత్రులు గడిపాను. కాని ఇవేవీ నా నిర్లక్ష్య వ్యర్థ జీవితాన్ని పుత్తేజ వంతం చేయలేకపోయాయి. నేను గాఢమైన లక్ష్యాన్ని వెలిగించుకోలేక పోవడానికి కూడా ఆ శిథిల గృహపు నీడే కారణమని తెలుసు. ఔను నేను దారి తప్పిపోయాను. మీరూ తప్పిపోయారు. కానీ మీరు ఆమోదయోగ్యమైన జీవితంలో తేలారు. నేనో వ్యభిచార గృహంలో తేలాను. మీకు వేదాంతం, నాకు గంజాయి. మీకు పవిత్రమైన ముసుగులున్నాయి. నాకు లేవు అంతే తేడా. నేనా శిథిల పవిత్ర గృహానికి చివరిసారిగా వస్తాను తొందర్లో.''

యింటికి వచ్చిన తమ్ముడికి గుమ్మంలోనే అడ్డుపడ్డాడు శాస్త్రి. ''యీ యింటిమీద, మామీద అంత గౌరవం లేనివాడివి ఎందుకు తగలడ్డావ్?''

తక్కున సమాధానం ''నాకు రావలసిన ఆస్తి గురించి''

ఆంధ్రజ్యోతి వారపత్రిక